సాక్షి అనకాపల్లి

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



ఆంధ్రా యూనివర్సిటీ కేంద్రం వద్ద భారీ క్యూ



నిఘాలో భాగంగా డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణ

రాష్ట్రంలో పగ, దగా పథకాలే..

- కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది
- గ్రూప్–2 అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారు
- ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం
- జగన్ కోసం ప్రాణాలు ఇచ్చేవారు కోట్లాది మంది ఉన్నారు
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు. చిత్రంలో అరకు ఎంపీ తనూజరాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, చిన్న శ్రీను, ధర్మాన కృష్ణదాస్, పార్టీ నేతలు (ఇన్‌సెట్) కన్నబాబును అభినందిస్తున్న బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో చంద్రన్న పగ.. చంద్రన్న దగా సంక్షేమ పథకాలే అమలవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా పూర్తి స్థాయిలో అమలుచేసిన పాపానపోలేదని, ఈ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం లేదని పేర్కొన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమన్వయ కర్తగా బృహత్తరమైన బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర అంటే ఉద్యమాలకు పురిటి గడ్డలాంటిదని, ఈ ప్రాంత ప్రజలు ఉద్యమిస్తే.. సాధించేవరకూ పట్టు వదలరని కొనియాడారు. అలాంటి ఈ ప్రాంత అభివృద్ధి కోసం విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు అన్నివిధాలా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేశారన్నారు. ప్రజలకు ఏమైతే మాట ఇస్తారో.. అది చేయడం వైఎస్ జగన్ నైజమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వారిచ్చిన ప్రతి హామీని అమలుచేసేలా వైఎస్సార్ సీపీ ప్రజల తరపున పోరాడుతుందని పేర్కొన్నారు. కూటమి 8 నెలల పాలనలో రూ.లక్షా 20 వేల కోట్లు అప్పు చేసిన సీఎం చంద్రబాబు.. ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని సేనల కన్నా వైఎస్ జగన్ సేన స్ట్రాంగ్‌గా ఉందని, ఆయన కోసం ప్రాణాలు ఇచ్చే కోట్లాది మంది కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు న్నారన్నారు. వైఎస్ జగన్ అంటే ఒక శక్తి.. ఆయన చాలా స్ట్రాంగ్ అని స్పష్టం చేశారు. ప్రజలే తమ బలమన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఒకరిద్దరు వెళ్లినంత మాత్రానా ఎటువంటి నష్టం లేదన్నారు.

కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజ రాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాస రావు, ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, పీవీ సురేష్, సాడి పద్మారెడ్డి, ఇమ్రాన్, ముఖ్యనేతలు కోలా గురువులు, రొంగలి జగన్నాథం, చొక్కాకుల వెంకట్రావ్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, పేర్ల విజయచందర్, కాయల వెంకటరెడ్డి, పేడాడ రమణికుమారి, మారుతీప్రసాద్, బోని శివరామకృష్ణ, శ్రీదేవి వర్మ, మాధవి వర్మ, పీలా వెంకటలక్ష్మి, కాళిదాస్‌రెడ్డి, సనపల రవీంద్ర భరత్, అల్లంపల్లి రాజుబాబు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రూప్–2 అభ్యర్థుల యువగర్జన చూశాం

ఎన్నికలకు ముందు లోకేష్ యువగళమంటూ తిరిగాడు.. అసలుసిసలైన యువగర్జన విశాఖ కేంద్రంగా గ్రూప్–2 అభ్యర్థులు చేశారని కన్నబాబు అన్నారు. గ్రూప్–2 పరీక్ష వాయిదా వేస్తామంటూ నమ్మించి అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారన్నారు. నిరుద్యోగులనే కాదు.. మహిళలు, అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం దగా చేసిందని మండిపడ్డారు.

చికెన్ కర్రీ... నో వర్రీ

- బర్డ్ ఫ్లూ భయం వద్దు...
- రేపు ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో చికెన్, ఎగ్ మేళా...
- ఎన్ఈసీసీ ప్రతినిధుల వెల్లడి



చికెన్, ఎగ్ పౌష్టికాహారం అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎన్ఈసీసీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: చికెన్ తినడం సురక్షితమని, బర్డ్‌ఫ్లూ వైరస్ పుకార్లు అవాస్తవమని రెడ్ క్రాస్ చైర్మన్, డాక్టర్ రామ్మూర్తి తెలిపారు. స్థానిక విజయారెసిడెన్సీలో నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు అధ్యక్షత వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనిషికి అవసరమైన ప్రొటీన్ తక్కువ ధరకు లభించేది చికెన్, ఎగ్‌లో మాత్రమేన్నారు. 100 గ్రాముల చికెన్ తింటే 20 గ్రాముల ప్రోటీన్ లభిస్తుందన్నారు. శరీరానికి అవసరమైన క్యాలరీలను అందించకపోతే ఇమ్యూనిటీ లోపిస్తుందన్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి కోడి నుంచి కోడి కి మాత్రమే వ్యాప్తిస్తుందన్నారు. చికెన్‌ను 70 సెంటీగ్రేడ్ వద్ద వేడి చేస్తే ఎటువంటి వైరస్ అయినా చనిపోతుందన్నారు. ఇంటిలో వంట చేసినప్పుడు 100 సెంటీగ్రేడ్ వేడి వస్తుందన్నారు. దీంతో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. పశు సంవర్ధక శాఖ శాఖ విశాఖ పట్నం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అరుల్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని, దీనిపై నిరంతరం కోళ్ల ఫారాలను తనిఖీలు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎన్ఈసీసీ సెంట్రల్ కమిటీ మెంబర్ రామారావు, వైజాగ్ జోనల్ చైర్మన్ శ్రీధర్, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ నార్త్ ఆంధ్ర రీజనల్ ప్రెసిడెంట్ సాయినాథరావు, స్టేట్ లెవెల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, నెక్ జోనల్ కమిటీ మెంబర్ అప్పారావు, లోకల్ కమిటీ చైర్మన్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

చికెన్ , ఎగ్ మేళా..

స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఈ నెల 25న సాయంత్రం ఐదు గంటలకు చికెన్, ఎగ్ మేళా నిర్వహిస్తున్నట్టు నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రజలందరూ భారీగా తరలిరావాలని కోరారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొంటారన్నారు. ఈ మేళాలో చికెన్, ఎగ్‌తో తయారుచేసిన ఐటమ్స్ ఉచితంగా అందిస్తామన్నారు.

దీనికి 'కోడ్' వర్తించదా..?



బొజ్జన్నకొండ వద్ద దర్శనమిస్తున్న కూటమి నాయకుల ఫ్లెక్సీ

తుమ్మపాల : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికల నిబంధనల్లో భాగంగా రాజకీయ నాయకుల ఫొటోలతో ప్రదర్శించిన అన్ని రకాల ఫ్లెక్సీలను తొలగించాల్సిన అధికారులు కూటమి నాయకుల ఫ్లెక్సీలకు ప్రత్యేక సడలింపులు చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకుల ఫ్లెక్సీల మినహా ఇతర పార్టీల బ్యానర్లను తొలగించారు. కూటమి నాయకుల బ్యానర్లపై గుడ్డలు కప్పి ప్రత్యేక మినహాయింపులు చేయగా కొన్ని గ్రామాల్లో బహిరంగంగానే వదిలేశారు. శంకరం వద్ద బొజ్జన్నకొండ, కోడూరు పంచాయతీ గొల్లపేట, పలు గ్రామాల్లో కూటమి నాయకుల బ్యానర్లు దర్శనమిస్తున్నాయి.

కఠిన పరీక్ష

గ్రూప్–2 అభ్యర్థులతో ఆటలాడుకున్న కూటమి ప్రభుత్వం

పరీక్ష వాయిదా వేస్తామంటూ ఆఖర్లో చేతులెత్తేసిన వైనం

చంద్రబాబు సర్కారుకి బలైన నిరుద్యోగ అభ్యర్థులు

మొదటి పేపర్‌కు 85.14 శాతం, రెండో పేపర్‌కు 84.95 శాతం హాజరు

సాక్షి, విశాఖపట్నం : ఏపీపీఎస్సీ చరిత్రలో ఎన్నడూ లేని గందరగోళం. చంద్రబాబు సర్కారు బాధ్యతారాహిత్యంతో చివరి వరకు అభ్యర్థుల్లో ఆందోళన. చివరికి పరీక్ష కేంద్రంలోనూ తీవ్ర ఒత్తిడికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. రోస్టర్ విధానంపై గత కొంతకాలంగా గ్రూప్–2 అభ్యర్థులు పోరాటాలు చేస్తున్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గ్రూప్–2 అభ్యర్థులకు న్యాయం చేస్తానంటూ ట్వీట్ చేశారు. సీఎం చంద్రబాబు పరీక్ష వాయిదా వెయ్యాలంటూ ఏపీపీఎస్సీకి లేఖ రాశారు. దీంతో పరీక్ష ఆగిపోతుందని అభ్యర్థులు భావించారు. పరీక్ష వాయిదా వెయ్యలేమంటూ ఏపీపీఎస్సీ చెప్పడంతో అభ్యర్థులు ఒత్తిడికి గురయ్యారు. పరీక్షకు 8 గంటల ముందు వరకూ చంద్రబాబు ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్పి నిరుద్యోగులతో ఆటలాడుకుంది. చివరికి పరీక్షకు వెళ్లాలంటూ చెప్పేసింది.

పరీక్ష రాసినా ఏం ఉపయోగం.?

గ్రూప్–2 అభ్యర్థులు ప్రిపరేషన్‌ని పక్కనపెట్టి ప్రభుత్వంతో పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో చాలా మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనా ఫలితం లేదని భావించారు. మరికొందరు చిన్నపాటి ఆశతో పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 16 కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 11,030 మందికి గాను ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జరిగిన తొలి పేపర్‌కు 9,391 (85.14 శాతం) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన రెండో పేపర్‌కు 9,370 (84.95 శాతం) మంది హాజరయ్యారు.

ఒత్తిడితోనే పరీక్ష రాసిన అభ్యర్థులు

ప్రభుత్వం చేసిన నిర్వాకంతో అభ్యర్థులంతా తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. దాదాపు ప్రతి ఒక్కరూ ఒత్తిడిలోనే పరీక్షలు రాశారు. కొందరు అభ్యర్థులు అస్వస్థతకు గురయ్యారు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం పరీక్ష రాస్తున్న ఓ అభ్యర్థి తీవ్ర ఒత్తిడికి లోనై అస్వస్థతకు గురయ్యారు. అధికారులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

డూప్లికేట్ హాల్ టికెట్‌తో హాజరు

సీతంపేట: డూప్లికేట్ హాల్ టికెట్‌తో గ్రూప్–2 మెయిన్స్ పరీక్షా కేంద్రంలోకి ఓ యువతి ప్రవేశించింది. సీతంపేట ప్రిజం డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. నెల్లూరుకు చెందిన నందిని అనే విద్యార్థిని ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అవ్వని విషయాన్ని దాచిపెట్టి మెయిన్స్ పరీక్ష కోసమని తల్లిదండ్రులతో కలిసి విశాఖ వచ్చింది. పరీక్ష కేంద్రంలో సిబ్బంది ఆమె డూప్లికేట్ హాల్ టికెట్‌ను చూసి ఈ నంబరు లేదని చెప్పారు. వెంటనే ఆమె బాత్ రూమ్‌కు అంటూ వెళ్లి అక్కడ స్పృహ తప్పి పడిపోయింది. దీంతో పరీక్షా కేంద్రం సిబ్బంది ద్వారకా పోలీసుల సాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి తల్లిదండ్రులతో నెల్లూరు పంపించేశారు. దీనిపై ద్వారకా సీఐ రమణను వివరణ కోరగా సంఘటన జరగడం వాస్తవమే అని తెలిపారు.

ఇక కోర్టులోనే తేల్చుకుంటాం..



రోస్టర్‌లో తప్పిదాలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం గ్రూప్–2 మెయిన్స్ వాయిదా వేస్తుందని భావించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పందించి పరీక్ష వాయిదాపై ఏపీపీఎస్సీకి సూచించడం, మంత్రి లోకేష్ న్యాయ నిపుణులతో మాట్లాడుతున్నాం.. అభ్యర్థులకు న్యాయం చేస్తాం అని ట్విట్టర్ ద్వారా స్పందించంతో సానుకూల నిర్ణయం వస్తుందని ఆశించాం. మేము ఊహించని విధంగా మాకు ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం పరీక్షకు హాజరైనప్పటికీ మాకు న్యాయం జరుగుతుందనే ఆశ లేదు. ఇక కోర్టులోనే న్యాయ పోరాటం చేస్తాం.

– లోకేష్, గ్రూప్–2 అభ్యర్థి



పరీక్ష హాల్ మరో చోట అని చెప్పడంతో పరుగులు తీస్తున్న అభ్యర్థులు

భద్రత కట్టుదిట్టం

పరీక్ష సమయంలో ఎలాంటి ఆందోళనలు జరగకుండా చర్యలు తీసుకోవాలంటూ కూటమి ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించడంతో ప్రతి కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. డ్రోన్లతో పరీక్ష కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరం వరకూ తనిఖీలు చేపట్టారు. కలెక్టరేట్‌లోనూ, పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

- అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన డి.శ్యామల కొమ్మాదిలోని విజయం స్కూల్ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా రావడంతో బయట నిలిపివేశారు. అలాగే రొంగలినాయుడుపాలేనికి చెందిన కొండబాబు బీవీకే కళాశాల కేంద్రానికి ఆలస్యంగా రావడంతో సిబ్బంది లోపలకు అనుమతించలేదు.

నిరుద్యోగులను మోసం చేయడమే..



నిరుద్యోగులకు మంచి చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవు. పైగా అభ్యర్థులు నష్టపోకుండా గ్రూప్–2 రోస్టర్‌ను సరిచేయాలని, అంతవరకు పరీక్ష వాయిదా వేయాలని ఉద్యమించినా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. శనివారం రాత్రి వరకు నిరసన చేపట్టిన అభ్యర్థులు చేసేది లేక ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వేర్వేరు జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్ష రాశారు. కూటమి ప్రభుత్వం ఇందుకు మూల్యం చెల్లించక తప్పదు. ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు వచ్చే అన్ని ఎన్నికల్లో బుద్ధి చెబుతాం.

– రోహిత్ కుమార్, గ్రూప్–2 అభ్యర్థి

శివరాత్రికి ప్రత్యేక బస్సులు



25 నుంచి 27 తేదీ వరకు

నర్సీపట్నం : మహా శివరాత్రి నేపథ్యంలో నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి భక్తులు గొలుగొండ ధారమట్టం, రావికతం కల్యాణలోవ శివ క్షేత్రాల దర్శనంకు వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో నెల 25 నుంచి 27వ తేదీ వరకు నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుండి అధిక సంఖ్యలో బస్సులు నడిపేలా అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు బస్సులను నడుపుతున్నారు. రెండు పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 50 బస్సులు నడిపేలా ప్రజా రవాణా అధికారులు చర్యలు చేపట్టారు. రద్దీకి అనుగుణంగా అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా భక్తులకు సురక్షితమైన ప్రయాణం అందించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఆర్టీసీ చార్జీలు పెంచకుండా సాధారణ చార్జీలతో భక్తులు ప్రయాణించేలా సౌకర్యం కల్పించారు.

సాధారణ చార్జీలే...

మహాశివరాత్రి స్నానాలకు వెళ్లే భక్తులకు బస్సులు సిద్ధంగా ఉంచాం. 50 బస్సులను నడుపుతున్నాం. రద్దీని బట్టి బస్సులను పెంచుతాం. ఆర్టీసీ సిబ్బంది నిత్య పర్యవేక్షణలో బస్సులను తిప్పుతాం. సాధారణ చార్జీలతోనే బస్సులు నడుపుతాం.

ధీరజ్(డిపో మేనేజర్, నర్సీపట్నం)

సాగుకు అందని నీరు



రాంబిల్లి -గోవిందపాలెం వద్ద పంటకాలువ మీదుగా తూరలు వేసుకొని వంతెన నిర్మాణం చేసుకున్న ఒక భూ యజమాని

పంట కాలువల ఆక్రమణలు గుర్తించడంలో రెవెన్యూ అధికారులు, నీటిపారుదలశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. రాంబిల్లి మండలంలో అన్ని గ్రామాల్లో పంటకాలువలు ఆక్రమించి కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ సొంత లేఔట్‌లు, భవనాలకు పరిశ్రమలకు ఎటువంటి అనుమతులు పొందకుండా దర్జాగా సిమెంట్ తూరలు ఏర్పాటు చేసుకొని రహదారి మార్గాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పొలాలకు వెళ్లాల్సిన నీటి ప్రవాహం రోడ్లపై వృథాగా పోతోంది.

- పంట కాలువలు ఎక్కడికక్కడే దిగ్బంధం
- యథేచ్ఛగా కాలువలు కప్పి లేఅవుట్లు, భవనాలకు రహదారుల ఏర్పాటు
- ఆక్రమణలను పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- చోద్యం చూస్తున్న నీటిపారుదల అధికారులు



భోగాపురం గ్రామంలో పంటకాలువ మీదుగా రహదారి నిర్మించడానికి వేసిన గ్రావెల్



రాంబిల్లి వద్ద ఒక పరిశ్రమకు పంటకాలువ మీదుగా రహదారి ఏర్పాటు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు భూముల ఎదుట పంటకాలువలపై ఎటువంటి అనుమతులు తీసుకోకుండా సిమెంట్ తూరలు ఏర్పాటు చేసుకొని వారి లేఔట్‌లకు రహదారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక పంటకాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలంటే అటు నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌వోసీలు తీసుకొని నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలి. అయితే వాటికి కొంత సమయం పట్టడంతో స్థానిక అధికారులతో రియల్ వ్యాపారులు, ఆక్రమణదారులు కుమ్మక్కై సిమెంట్ తూరలు ఏర్పాటు చేసుకొని దర్జాగా తమ సొంత స్థలాలకు రహదారుల నిర్మాణం చేసేసుకుంటున్నారు. కళ్ల ముందు పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

పంచదార్ల కొనేరు వద్ద..

మండలంలో పంచదార్ల కోనేరు వద్ద ఒక వ్యక్తి పంట కాలువను ఆక్రమించి తన సొంత స్థలానికి ఎదురుగా ఉన్న పంటకాలువలో తాత్కాలిక సిమెంట్ తూరలు ఏర్పాటు చేసుకొని రహదారిని నిర్మించుకున్నాడు. దీనిపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు ఆక్రమణకు గురైన పంట కాలువ వద్ద గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సదరు నేత తన పలుకుబడి ఉపయోగించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి పంటకాలువను తన సొంత అవసరాలకు వాడుకుంటున్నాడు. దీనిపై మళ్లీ స్థానిక ప్రజలు కొంత మంది రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళితే వారు స్థలం వద్ద తూతూ మంత్రంగా తనిఖీలు చేసి దానిపై అధికార పార్టీ నేత ఒత్తిళ్లకు తలొగ్గి ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

రాంబిల్లి–గోవిందపాలెం గ్రామాల మధ్య..

రాంబిల్లి ప్రధాన రహదారి గుండా గోవిందపాలెం నేవల్‌బేస్ ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న పంట కాలువను కాలువకు సమీపంలో ఉన్న భూ యజమానులు కొంతమంది తమ సొంత స్థలాలకు ,భవనాలకు తాత్కాలిక వంతెనలను పంటకాలువకు అడ్డుగా నిర్మాణం చేసుకుని దర్జాగా రహదారిని నిర్మించేసుకున్నారు. రాంబిల్లి మండలంలో నేవల్‌బేస్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల వలస కార్మికులు ఎక్కువగా రావడంతో వారికి వసతి కల్పించడానికి పంటభూముల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకొని అద్దెకు ఇవ్వడానికి భవన యాజమానులు తమ సొంత స్థలాల ఎదురుగా ఉన్న పంట కాలువను ఆక్రమించి రహదారి సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే భోగాపురం గ్రామంలో పంటకాలువ మీదుగా ఆక్రమణదారులు కాలువలు కప్పేసి తమ సొంత స్థలాలకు లేఔట్‌లకు రహదారిని నిర్మాణం చేసుకుంటున్నారు. దీనిపై గ్రామంలో ప్రజలు అభ్యంతరం తెలపడంతో ఆ రోడ్డు నిర్మాణం పనులు మధ్యలోనే ఆపేశారు.

అధికారులు చూసీ చూడనట్టు...

నారాయణపురం–మామిడివాడ గ్రామాల మధ్య పంటకాలువ ఆక్రమణ మండలంలో నారాయణపురం–మామిడివాడ గ్రామాల మధ్య ఒక వ్యాపారి పెద్ద భవనం నిర్మాణం చేస్తున్నాడు. దానికి ఎదురుగా ఉన్న పంటకాలువ మీదుగా రహదారిని నిర్మాణం చేసుకోవడానికి తూరలు వేయడానికి గోతులు తవ్వి ఉంచాడు అటుగా అధికారులు వెళుతున్నా వాటిపై కనీసం పర్యవేక్షణ లేకపోవడం పట్ల పలువురు ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరి

రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై పంట కాలువల ఆక్రమణలపై రెవెన్యూ–నీటిపారుదలశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాగునీటి కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడం వలన రైతులు వ్యవసాయానికి సకాలంలో నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

చట్టరీత్యా నేరం

మండలంలో ఆక్రమణకు గురైన పంట కాలువలను గుర్తించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. పంటకాలువలు ఆక్రమణ చేయడం చట్ట రీత్యా నేరం. పంటకాలువలు ఆక్రమణకు గురైతే ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అలగే పంటకాలువపై తాత్కాలిక వంతెనలు నిర్మాణం చేపట్టరాదు.

– శ్రీనివాసరావు, రాంబిల్లి తహసీల్దారు

ఆక్రమణలు గుర్తించి చర్యలు

పంట కాలువలపై ఎటువంటి తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేయరాదు. నీటి ప్రవాహానికి అడ్డు కట్ట వేయరాదు. రాంబిల్లి మండలంలో పంటకాలువల ఆక్రమణలు గుర్తించి వాటిపై చర్యలు తీసుకుంటాం. పంటకాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలంటే అధికారుల అనుమతులు తీసుకోవాలి. తాత్కాలిక తూరలు ఏర్పాటు చేయరాదు.

– శివాజీ, నీటిపారుదలశాఖ ఏఈ, రాంబిల్లి

స్వచ్ఛ భారత్.. ఇంటింటా స్పెషల్ డ్రైవ్

- తడి, పొడి చెత్త సేకరణపై ప్రజల్లో విస్తృత అవగాహనకు చర్యలు
- డీపీవో శిరీషారాణి



దేవవరంలో ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది



నక్కపల్లిలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

నక్కపల్లి : జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను తడి పొడి చెత్తను ఇళ్ల వద్ద నుంచే సేకరించే ప్రత్యేక డ్రైవ్ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి తెలిపారు. గ్రామాల్లో రెండు రోజుల నుంచి పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ ఆదేశాల మేరకు తడి, పొడి చెత్తను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పంచాయతీ స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్ల సాయంతో ప్రతి ఇంటికి వెళ్లి గతంలో పంచాయతీ వారు అందజేసిన ప్లాస్టిక్ డబ్బాల్లో తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నా రు. ఇళ్లల్లో ఊడ్చిన చెత్తతోపాటు, వీధుల్లో, ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న చెత్తను సేకరించే ప్రక్రియ జరుగుతోంది.ఆదివారం ఆమె నక్కపల్లిలో తడి , పొడి చెత్తను సేకరించే ప్రత్యేక డ్రైవ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ వారికి అందజేసేలా అవగాహన కల్పించడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. వీధులు అపరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. స్వచ్ఛతా, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఈ చెత్త సేకరణ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఒకేసారి నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో పంచాయతీ వారి ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వచ్ఛభారత్ లక్ష్యంగా చేసుకుని నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాల వద్ద వేర్వేరుగా ఉంచి వానపాముల సాయంతో వర్మి కంపోస్టు తయారు చేయడం జరుగుతుందన్నారు. ఇళ్ల వద్దే ఇంకుడు గుంతలు నిర్మించడం, తడి, పొడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువులు తయారీ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం సూచిస్తోందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ వారి సాయంతో త్వరలోనే ఈ ప్రక్రియ కూడా ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరణ కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారన్నారు. ఒకటి రెండు రోజులతో ఈ కార్యక్రమం ముగించకుండా ప్రజలు సైతం నిరంతర ప్రక్రియగా భావించి ఇళ్లలో ఊడ్చిన చెత్తను బయట వేయకుండా ప్రత్యేక డబ్బాల్లో ఉంచి పంచాయతీ స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. నక్కపల్లి, దేవవరం, వేంపాడు, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, గొడిచర్ల, నెల్లిపూడి, వెదుళ్లపాలెం, పెదతీనార్ల, చినతీనార్ల, గునిపూడి, ఉపమాక తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని రెండురోజుల నుంచి నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీసం రాజు, పంచాయతీ కార్యదర్శులు సన్ని శ్రీనివాస్, బిఏబీఎల్‌మూర్తి, రాజశేఖర్, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆశాజనకంగా కోనాం నీటి మట్టం


కోనాం జలాశయం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం ఆశాజనకంగా ఉంది. ఈ జలాశయం ఒక పంటకే నీరు అందించే సామర్థ్యం కలదైనా జలాశయంలో నీరు ఉంటే రబీలో సాగుచేసే వరి, అపరాలతో పాటు చెరకు, పశువుల తాగునీరుగా విడుదల చేస్తుంటారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం 97.40 మీటర్లు వద్ద ఉంది. ఇన్‌ఫ్లో 10 క్యూసెక్కులుండగా ఎగువ, దిగువ గేట్ల ద్వారా 50 క్యూసెక్కుల నీరు విడుదలౌతుంది. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు మేలు జరుగుతుంది.

గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ


ర్యాలీలో హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది

ఏయూక్యాంపస్: ఇంధన వనరులను పరిరక్షించుకుంటూ ప్రతి వ్యక్తి దేశాభ్యున్నతికి పాటుపడాలని హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరి ఈడీ రామనాథన్ రామకృష్ణన్ అన్నారు. హెచ్‌పీసీఎల్ విశాఖ లూబ్ రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సైకిల్ థాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా సాక్ష్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏయూ ఇన్‌గేట్ వద్ద నున్న పెట్రోలియం నుంచి బీచ్ రోడ్డు మీదుగా సైకిల్ థాన్ నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది, డీలర్లు, డెలివరీ సిబ్బంది, నగరవాసులు ఉత్సాహంగా తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. పరిశుభ్రమైన ఇంధనాన్ని, ప్రధానంగా గ్రీన్‌ఎనర్జీని వినియోగిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను తెలిపే విధంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

ట్యూషన్ మాస్టారు


లాసా ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేత(ఫైల్)

- 18 ఏళ్లుగా ఇంటి వద్ద ఉచితంగా ట్యూషన్లు
- అప్పలరాజుపురంలో ఉపాధ్యాయుడిగా బోధన
- ఇంజినీర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్లుగా స్థిరపడ్డ శిష్యులు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిన కుమారుడు, కుమార్తె
- ఆదర్శంగా ఆడారి శ్రీనివాసరావు మాస్టారు


కలెక్టర్ విజయకృష్ణన్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న శ్రీను (ఫైల్)


కరోనా సమయంలో బాటసారులకు అన్నదానం (ఫైల్)


కె.జె.పురంలో తన ఇంటి వద్ద ట్యూషన్ చెప్తున్న శ్రీను మాస్టారు

మాడుగుల రూరల్: పాఠశాలలో రెండు పిరియడ్స్ బోధించడానికే కొంతమంది ఉపాధ్యాయులు అసహనానికి గురవుతారు. ఎప్పుడు సాయంత్రం ఐదయితే ఇంట్లో వాలిపోదామా.. అని ఎదురు చూస్తుంటారు. అటువంటిది ఓ ఉపాధ్యాయుడు రోజంతా పాఠశాలలో బోధించడమే కాదు.. ఇంటికెళ్లాక పేద విద్యార్థులకు ట్యూషన్ చెబుతున్నారు. 18 ఏళ్లుగా ఉచితంగా ట్యూషన్ చెబుతూ ఉన్నత స్థాయికి ఎదిగేలా ఎంతోమందిని తీర్చిదిద్దుతున్న ఆడారి శ్రీనివాసరావు మాస్టారు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. మాడుగుల మండలం కె.జె.పురం గ్రామానికి చెందిన ఆయన చోడవరంలో బీఎస్సీ, విశాఖలో బీఈడీ పూర్తి చేసి, 1998 డీఎస్సీలో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయునిగా ఎంపిక య్యారు. వివిధ పాఠశాలల్లో పని చేసిన ఆయన మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారంలో విద్యార్థుల సంఖ్యను పెంచారు. తన కుమారుడు బుచ్చి వెంకటేష్, కుమార్తె నేహాలను ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. తాను చదువుకున్న అప్పలరాజుపురం హైస్కూలులోనే ప్రస్తుతం పని చేస్తున్నారు. 18 ఏళ్లుగా ఆయన తన స్వగృహంలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్తున్నారు. అతని వద్ద చదువుకున్న ఎంతో మంది ఇంజినీర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్లుగా స్థిరపడ్డారు.

వివిధ సేవా కార్యక్రమాలు...

ఆపదలో ఉన్నవారి కోసం శ్రీనివాసరావు 12 సార్లు రక్తదానం చేశారు. కె.జె.పురం జంక్షన్‌లో నిర్మించిన కల్యాణ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారు. లాసా ఫౌండేషన్ ద్వారా ప్రమాదం వల్ల జీవనోపాధికి ఇబ్బందులు కలిగిన ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. కరోనా సమయంలో పాడేరు నుంచి విశాఖ, తదితర దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఆహార పొట్లాలు అందించి ఆకలి తీర్చారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

విద్యా రంగంలో శ్రీనివాసరావు సేవలను గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక చేశారు. గతేడాది సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్ నుంచి పురస్కారం అందుకున్నారు.

చిత్తశుద్ధితో పని చేస్తుంటారు



శ్రీనివాసరావు మాస్టారు సేవలు ప్రశంసనీయం. పాఠశాలలో చిత్తశుద్ధి పని చేస్తుంటారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల ఉత్తీర్ణత కోసం కృషి చేస్తున్నారు. రాత్రి పూట వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

– వి.ఎస్.ఆర్. కల్యాణి, హెచ్‌ఎం, అప్పలరాజుపురం హైస్కూలు

మాస్టారు దగ్గర నేర్చుకున్నా



శ్రీను మాస్టారు వద్ద 2017–18లో నేను గణితం, భౌతికశాస్త్రం నేర్చుకుని పదో తరగతి పాసయ్యాను. మాస్టారు ఎంతో క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆయన అందరికి స్ఫూర్తిదాయకం. – కాళ్ల గిరిజ, ఎంబీబీఎస్,కె.జె.పురం, మాడుగల మండలం

రోడ్డును తవ్వేసిన కూటమి నాయకుడు


చినబాబుకాలనీలో జేసీబీతో రోడ్డును తవ్వేసిన కూటమి నాయకుడు

తుమ్మపాల: గ్రామాల్లో కూటమి నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్రమార్జనే లక్ష్యంగా పెట్టుకుని పూర్వ కాలంగా ఉన్న రోడ్లను, బండిబాటలను సైతం జేసీబీలతో తవ్వేసి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. రోడ్లను అడ్డంగా తవ్వేసి రైతులు, నివాసాల నుంచి నగదు వసూలుకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉదాసీనతను అదునుగా చూసుకుని కొన్ని గ్రామాల్లో హద్దులు మీరి వ్యవహరిస్తున్నారు. ఇటీవల రామాపురం కాలనీల్లో రోడ్డును తవ్వేసిన ఘటన మరువక ముందే తుమ్మపాల పంచాయతీ చినబాబుకాలనీలో **ఆదివారం కూటమి నాయకుడు జేసీబీతో రోడ్డును అడ్డంగా తవ్వేశాడు. రోడ్డు దాటి వెళ్లాలంటే రైతులు, స్థానికేతరులు తమకు నగదు చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నాడని పలువురు వాపోతున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో పీలా వెంకటసత్యనారాయణ ఏకంగా రోడ్డునే తవ్వేసి రాకపోకలు నిలిపేశాడంటూ కాలనీ వాసులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.**

అల్లూరికి ఘన నివాళి


అల్లూరి సమాధులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా విశాఖ నుంచి రెండు రోజులు పాటు బస్‌జాత కార్యక్రమం ఆదివారం కృష్ణదేవిపేట చేరుకుంది. ఇక్కడ ఉన్న అల్లూరి, గంటందొర సమాధులకు జాత సభ్యులు పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ప్రమీళా, వాడపల్లి వెంకటరమణమ్మ, చంద్, గంగాధర్ మాట్లాడుతూ అల్లూరి జీవత చరిత్ర నేటి యువతరంకు తెలిసే విధంగా ఈ బస్ జాత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల పాటు అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతాల్లో విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలు చెప్పడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడుతో పాటు కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిపోను తనిఖీ చేసిన డిప్యూటీ సీటీఎం


సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న సీటీఎం అప్పలనాయుడు

నర్సీపట్నం : విజయనగరం జోన్ డిప్యూటీ సీటీఎం(ఆపరేషన్స్, కమర్షియల్) విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి.అప్పలనాయుడు నర్సీపట్నం డిపోను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాడేరు నుంచి మత్స్యగుండం, విశాఖపట్నం రామకృష్ణ బీచ్, నర్సీపట్నం డిపో కల్యాణపులోవ, ధారమట్టం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా సాధారణ ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామన్నారు. పార్శిల్ రవాణాలో విజయనగరం జోన్-1 ముందుంజలో ఉన్నదన్నారు. డోర్ డెలవరీ సౌకర్యాన్ని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. అనంతరం డిపోలో ట్రాఫిక్, గ్యారేజ్ సెక్షన్‌లను తనిఖీ చేశారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ



విశాఖ–లీగల్ : విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని విశాఖ న్యాయవాదుల సంఘం ఆవరణలో ఆరు జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయవాదులందరూ విశాఖకు హైకోర్టు బెంచ్, కేంద్ర పారిశ్రామిక ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందడుగు వేయాలని నిర్ణయించారు. శ్రీకాకుళం, పార్వతీపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లాలంటే చాలా భారంగా ఉందని న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ అన్ని రకాలుగా మోసానికి గురైందని వెల్లడించారు. అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తున్న విశాఖకు హైకోర్టు బెంచ్ కేటాయించడం అన్ని విధాల శ్రేయోదాయకమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి. నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు ఏర్పాటు సంబంధించి న్యాయశాఖకు అభ్యంతరాలు ఉండకపోవచ్చన్నారు. 1993లో హైకోర్టుమెంట్ సాధనకు న్యాయవాదులు చేసిన ఉద్యమాలను గుర్తు చేస్తూ భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో పోరాడతామన్నారు. సోమవారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయస్థానానికి హాజరవుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఏవీ పార్వతీశం, కృష్ణ శేఖర్, పూర్వ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, పాలకొండ, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, అనకాపల్లి, చోడవరం, తుని, యలమంచిలి, విజయనగరం, ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొన్నారు. న్యాయవాద సంఘం కార్యదర్శి డి.నరేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

తాగునీటి కోసం గిరిజనుల వినూత్న నిరసన


గెడ్డనీటిలో దిగి వినూత్న రీతిలో నిరసనకు దిగిన నగరంపాలెం గిరిజనులు

దేవరాపల్లి: తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ మండలంలోని వాలాబు పంచాయతీ శివారు నగరంపాలెం గిరిజనులు ఆదివారం ఆందోళన చేపట్టారు. గ్రామ గిరిజన మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం గెడ్డ నీటిలో దిగి వినూత్న రీతిలో తమ నిరసనతో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా తమ గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో గెడ్డ నీటిని తాగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర మద్దతు పలికారు. వెంకన్న, దొర మాట్లాడుతూ నగరంపాలెం గ్రామానికి జలజీవన్ మిషన్ స్కీమ్ మంజూరై సగం మేర పైపు లైన్ పనులు పూర్తి కాగా, అనుమతులు లేవంటూ అటవీశాఖ అధికారులు అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అనుమతులు కోరినా అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గెడ్డల్లో కలుషిత నీటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు. వేసవిలో గెడ్డ నీరు సైతం దొరకని దుస్థితి ఉంటుందని ఆగ్రహించారు. ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలనకు వచ్చిన ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పెడ చెవిని పెట్టారన్నారు. పది రోజుల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలని లేకుంటే ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయం **ఎదుట** ఆందోళన చేపడతామని హెచ్చరించారు. **వంతల** మహేష్, సూకురి రామకృష్ణ, తామర్ల **బుచ్చమ్మ**, మామిడి రవికుమా ర్, వంతల దేముడు, **వంతల** చిన్నారావు, సూకురి గంగమ్మ, కిమిడి స**న్యాశిరావు** పాల్గొన్నారు.

కుంభమేళాకు వెళుతూ ప్రమాదం

- ఐదుగురికి గాయాలు

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం హైవేపై ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని దేవీనగర్, కురుబుర హాస్టల్ ప్రాంతానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురికి స్వల్ప గాయాలు కాగా లక్ష్మీదేవికి ఎడమకాలు విరిగిపోయింది. బళ్లారికి చెందిన 35 మంది యాత్రికులు, డ్రైవర్ వీరయ్య, క్లీనర్‌తో కలిసి ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు బయలుదేరారు. శనివారం విజయవాడలో కనకదుర్గమ్మ దర్శనం అనంతరం ఆనందపురం వైపు వస్తున్నారు. డ్రైవర్ అతివేగంతో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడిన వారిని కేజీహెచ్‌కు తరలించారు.

సీపీ చొరవతో 15 ఏళ్ల తరువాత తల్లి చెంతకు..


గురువయ్యను తల్లికి అప్పగిస్తున్న రెడ్ క్రాస్ హోం సిబ్బంది

బీచ్‌రోడ్డు: మనోవేదనతో 15 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వచ్చేసిన కుమారుడ్ని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో..రెడ్‌క్రాస్ సిబ్బంది ఆధ్వర్యంలో తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా..మచిలీపట్నం జిల్లా పామర్రుకు చెందిన కోటమ్మ దంపతులకు ఆరుగురు సంతానం. వీరిలో గురువయ్యకు పెళ్లికాగానే కొద్ది రోజుల తరువాత అనారోగ్యంతో భార్య మృతి చెందింది. దీంతో మనోవేదనకు గురై 15 ఏళ్ల క్రితం విశాఖ వచ్చేశాడు. అప్పటి నుంచి విశాఖ బీచ్‌లో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం గురువయ్యను గమనించిన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి స్థానికంగా ఉండే కానిస్టేబుల్‌కు గురవయ్యను అప్పగించి పెదవాల్తేరులో ఉన్న రెడ్‌క్రాస్ హోం షెల్టర్‌కు తరలించారు. అక్కడ సిబ్బంది గురవయ్య వివరాలు సేకరించారు. ఆయన తల్లి కోటమ్మ దువ్వాడలోని కుమార్తె వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో తల్లికి సమాచారం అందజేయగా..ఆమె ఆదివారం సాయంత్రం రెడ్ క్రాస్ హోంకు చెరుకొని కుమారుడ్ని తీసుకుని వెళ్లింది.

యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం : మనస్తాపంతో యువకుడు మృతి చెందిన ఘటన గోపాలపట్నం ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన సోమేష్, నాగరాజు స్నేహితులు. సోమేష్‌కు సొంత ఆటో ఉంది. అప్పుడప్పుడు నాగరాజు ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత ఏడాది సంక్రాంతి సమయంలో సోమేష్‌కు చెందిన పర్సు ఆటోలో పడిపోయింది. సోమేష్‌ను ఇంటి వద్ద దించి వేరే బేరం ఉండడంతో నాగరాజు ఆటో తీసుకుని వెళ్లాడు. పర్సు పోయిన విషయాన్ని నాగరాజుకు చెప్పగా..తనకు తెలియదని బదులిచ్చాడు. సోమేష్ కూడా పోలీసులు ఫిర్యాదు చేయలేదు. వీరిద్దరి స్నేహితుడు రౌతు ఆనంద్‌కు మూడు రోజుల క్రితం సోమేష్ పర్సు దొరికింది. అందులో గుర్తింపు కార్డులుండడంతో సోమేష్‌కు అందజేశాడు. పర్సులో రూ.25వేలు ఇవ్వాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నాగరాజును, ఆనంద్‌ను చెరో రూ.10 వేలు చొప్పున ఇచ్చి కేసు రాజీ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఆదివారం ఉదయం స్టేషన్‌కు పిలిచి మధ్యాహ్నం వరకు ఉంచేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆనంద్ ఆదివారం మధ్యాహ్నం ఇంటికి చేరుకుని ఉరేసుకుని మృతి చెందాడు. చేయని తప్పునకు బాధ్యుడ్ని చేయడంతో తన కుమారుడ్ని ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పరిశోధకుల పరీక్షలకు గ్రీన్ సిగ్నల్

- వీసీ శశిభూషణ్ తప్పుకున్న రోజునే సర్క్యులర్
- హయ్యర్ ఎడ్యుకేషన్ మౌఖిక ఆదేశాలు అంటూ వెల్లడి
- అభియాన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవటంలో అంతా గోప్యత
- టీడీఆర్ హబ్ ప్రవేశాలపై ఎందుకీ హైడ్రామా
- అవినీతి ఆచార్యులతో ఏయూకు అప్రతిష్ట



టీడీఆర్ హబ్

విశాఖవిద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్స్ పరీక్షలకు వర్సిటీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టీడీఆర్ హబ్ ద్వారా ప్రవేశాలు పొందిన రీసెర్చ్ స్కాలర్స్ విషయంలో జనవరి 28న ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నట్లు వర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్ తాజాగా మరో ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత విద్యామండలి మౌఖిక ఆదేశాల మేరకు ఇది తక్షణమే అమల్లోకి వస్తోందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆచార్య శశిభూషణరావు వీసీగా బాధ్యతల నుంచి రిలీవ్ అయిన రోజే (ఈ నెల 18న) ఉత్తర్వులు జారీ కాగా, వర్సిటీ విభాగాధిపతులకు అవి చేరకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వర్సిటీకి నూతన వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ఆచార్య రాజశేఖర్ నేడో, రేపో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇలాంటి సమయంలో, ఆచార్య శశిభూషణరావు వీసీగా తప్పుకున్న రోజున ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తారా..? లేదా..? అనే అనుమానాలను కొంతమంది ఆచార్యులు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు, ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయాలతో టీడీఆర్ హబ్ ద్వారా చేపట్టిన ప్రవేశాలపై ప్రస్తుత అధికారులు అనుసరిస్తున్న విధానాలు రీసెర్చ్ స్కాలర్స్‌ను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

టీడీఆర్ హబ్‌పై ఎందుకీ హైడ్రామా

ఆంధ్ర యూనివర్సిటీలో 2019 నుంచి 2023 వరకు 680 మంది విద్యార్థులు పీహెచ్‌డీ కోర్సుల్లో చేరారు. వీరితో పాటు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో మరో 72 మంది వరకు ప్రవేశాలు పొందారు. ఇదంతా నిబంధనల మేరకే జరిగినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వర్సిటీలో రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. ఈ ప్రభావం రీసెర్చ్ స్కాలర్స్‌పై చూపుతోంది. టీడీఆర్ హబ్ ప్రవేశాల విషయంలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలే తప్ప, పరీక్షలు నిలిపివేయడమేంటని పరిశోధక విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. ఇది దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని భావించిన ఉన్నత విద్యామండలి, పరీక్షల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

అవినీతి ఆచార్యులతోనే అప్రతిష్ట

ఆంధ్ర యూనివర్సిటీకి ఉన్న క్రేజ్‌తో ఇక్కడ పరిశోధనలు చేసేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే, వర్సిటీకి మరింత ఖ్యాతి ఇనుమడింపజేసేలా ప్రసాద్ రెడ్డి వీసీగా ఉన్న సమయంలో ట్రాన్స్ డిసిప్లెనరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్‌ను ఏర్పాటు చేసి, దీని ద్వారానే పరిశోధనలకు సంబంధించిన ప్రవేశాలు చేపట్టారు. డాక్టరేట్ ప్రదానం చేసేందుకు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసే, వర్సిటీలోని ఒకరిద్దరు ఆచార్యులకు ఇది మింగుడుపడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రెక్కలొచ్చిన సదరు అవినీతి ఆచార్యులు, పనిగట్టుకొని ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో రీసెర్చ్ స్కాలర్స్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టాయనే ప్రచారం ఉంది.

ఏపీఆర్‌సెట్ విద్యార్థులకే వెసులుబాటు

రీసెర్చ్ స్కాలర్స్ పరీక్షల విషయంలో గతంలో ఇచ్చిన అభియాన్స్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న మాట వాస్తవమే. ఏపీఆర్‌సెట్ ద్వారా ప్రవేశాలు పొందిన వారికే పరీక్షలు కొనసాగించేలా ఉన్నత విద్యామండలి నుంచి మౌఖిక ఆదేశాలు ఉన్నాయి. ఇదే విషయాన్ని వర్సిటీ అన్ని విభాగాధిపతులకు సమాచారం ఇచ్చాం. కె. ఈశ్వర కుమార్, అకడమిక్ ఎఫైర్స్ డీన్

మాకెలాంటి ఉత్తర్వులు అందలేదు

రీసెర్చ్ స్కాలర్స్ పరీక్షలు నిర్వహించాలని మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఏదైనా అంతా నిబంధనలు మేరకే జరుగుతుంది. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగానే టీడీఆర్ హబ్ నిర్ణయాలు ఉంటాయి. కొత్త వీసీ వచ్చాకే రీసెర్చ్ స్కాలర్స్‌కు పరీక్షలు నిర్వహించే విషయంలో ముందుకెళ్లే అవకాశం ఉంది. – ఆచార్య పి. మల్లికార్జునరావు, టీడీఆర్ హబ్ డీన్

క్లుప్తంగా

కండక్టర్ నారాయణ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి



డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

అనకాపల్లి: ఆర్టీసీ అనకాపల్లి డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ ఎస్.ఎస్.నారాయణ సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ కోరారు. స్థానిక డిపో గ్యారేజీ గేటు వద్ద ఆదివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ సస్పెన్షన్‌ను రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామన్నారు. అసోసియేషన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి జి.ఎస్.రావు, డిపో అధ్యక్షుడు ఎ.ఎస్.రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెదురుపర్తిలో 'విద్యార్థి మేలుకో'



వెదురుపర్తిలో తల్లిదండ్రులకుటెన్త్ విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న హెచ్‌ఎం మూర్తి

కశింకోట: వచ్చే నెలలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల చదువు పట్ల ఇళ్ల వద్ద తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని వెదురుపర్తి హైస్కూలు హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి సూచించారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో ఆదివారం 'విద్యార్థి మేలుకో' కార్యక్రమంలో భాగంగా ఉదయమే టెన్త్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రీ ఫైనల్ పరీక్షలలో చూపిన ప్రతిభను తెలియజేసే ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వెనుకబడిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణతకు అనుసరించాల్సిన మార్గాలపై సూచనలు, సలహాలు అందించారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు చిన్నారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా కలశ పునః ప్రతిష్టాపన



రామాలయంలో కలశ ప్రతిష్టాపన పూజలు చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి దంపతులు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం రామాలయంలో కలశ పునః ప్రతిష్టాపనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ సంప్రదాయంగా ఆలయ పూజారి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పసిడి కలశాన్ని కలగా వెంకటేశ్వరరావు అందజేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, గ్రామ నాయకులు కలగా సోమేశ్వరరావు, కలగా గోవింద తదితరుల సహకారంతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలశ ప్రతిష్టాపన పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
ఆరెంజ్ : సత్యనారాయణస్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2 : సత్యనారాయణస్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్ : పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
సూర్య కృష్ణన్ : వెంకటేశ్వర(ఉదయం)
తల : వెంకటేశ్వర(మ్యాట్నీ, 1, 2 షోలు)
సై : శ్రీసత్య
రామం రాఘవం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 57 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 224 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

ఎన్నాళ్లీ గేట్ కష్టాలు..!

- రవాణా రైళ్ల రాకపోకలతో ఎక్కువ సమయం మూతపడుతున్న గేటు
- సకాలంలో గమ్యస్థానం చేరలేక వాహనచోదకుల అవస్థలు
- ఫ్లైఓవర్ లేదా అండర్ పాత్‌వే నిర్మించాలని విజ్ఞప్తి



గేటు తెరవడంతో ఒక్కసారిగా దూసుకొస్తున్న వాహనాలు



కశింకోటలోని రైల్వే గేటు వేయడంతో నిలిచి ఉన్న వాహనాలు

కశింకోట: కశింకోటలోని రైల్వే గేటుతో రాకపోకలకు వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కువ సమయం గేటు వేసి ఉంటుండడంతో రాకపోకలకు తీవ్ర జాప్యమవుతోంది. గమ్యాలకు సకాలంలో చేరలేక వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు. కశింకోట రైల్వే స్టేషన్ వద్ద ఉన్న గేటు సుమారు 60 ఏళ్ల క్రితం ఏర్పడింది. గేటు దాటుకొని నిత్యం సుమారు 30 వేల జనాభా కలిగిన కశింకోట, సంపతిపురం, తమ్మయ్యపేట, జంగాళపాలెం, కూండ్రం, కుంచంగి, వెదురుపర్తి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. వారితో పాటు ఇతర గ్రామాల నుంచి వద్దాది, బుచ్చియ్యపేట తదితర ప్రాంతాలకు దగ్గరి దారిగా గేటును దాటి చోదకులు వెళుతుంటారు. జంగాళపాలెం ప్రాంతంలో స్టోన్ క్రషర్లకు వెళ్లి లారీలు, ట్రాక్టర్లు, వ్యాన్లలో భవన నిర్మాణ సామగ్రిని తరలిస్తుంటారు. దీంతో వాహనాలు నిత్యం గేటును దాటాల్సి ఉంటుంది. గతంలో రైళ్ల రాకపోకలు తక్కువగా ఉన్నప్పుడు పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు విశాఖ-విజయవాడ **మార్గంలో ఉన్న గేటు మీదుగా వేగంగా విద్యుత్‌తో నడిచే సుమారు 180 పాసింజర్ రైళ్లు, గూడ్స్ రైళ్లు రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో దాదాపు నగం గూడ్స్ రైళ్లే ఉన్నాయి. ప్రయాణికుల రైళ్లు గేటు దాటడానికి 5 నిమిషాల వరకు** సమయం పడుతుంది. అదే గూడ్స్ రైలు అయితే దాదాపు పది నిమిషాలు సమయం, ఒక్కొక్కసారి **మూడు రైళ్లకు ఏకంగా గేటు వేయడంతో అర గంట పాటు నిరీక్షించాల్సి ఉంటోంది. గేటు తెరిచిన రెండు, మూడు నిమిషాల వ్యవధిలోనే మళ్లీ గేటు పడుతోంది. ఇలా ఎక్కువ సమయం పాటు గేటు వేసే ఉంటోంది. దీంతో రాకపోకలు సాగించడా**నికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనక తప్పడం లేదు.

తప్పని ప్రమాదకర ప్రయాణం

కొందరు వాహన చోదకులు గేటు వేసి ఉన్నప్పుడు ప్రమాదకరమని తెలిసినా త్వరగా వెళ్లాలనే ఆతృతలో గేటు కింద నుంచి బైక్‌లను వంచి ముందుకు తీసుకెళుతున్నారు. ఇటువంటి సమయంలో రైలు వస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అయినా తెగించి గేటును దాటుతున్న పరిస్థితులున్నాయి. గతంలో ఇక్కడ అండర్ పాత్ నిర్మాణానికి ప్రయత్నాలు జరిగినా కార్యాచరణలో ముందుకు వెళ్లలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇక్కడ రైల్వే గేటు స్థానంలో ఫ్లైఓవర్ గానీ, అండర్ పాత్ వే గానీ నిర్మించాలని ఈ ప్రాంత వాహన చోదకులు కోరుతున్నారు.



గేటు వేసి ఉన్నప్పుడు గేటు కింద నుంచి బైక్ తీసుకెళుతున్న వాహన చోదకుడు

ఎప్పుడూ గేటు వేసే ఉంటోంది..



కశింకోటలో గేటు ఎక్కువ సమయం వేసే ఉంటోంది. మరో మార్గం లేక నిరీక్షించాల్సి వస్తోంది. సకాలంలో గమ్యాలకు చేరుకోలేకపోతున్నాం. గేటుపై ఫ్లైఓవర్ నిర్మించి కష్టాలు తీర్చాలి.
– భీమరశెట్టి సత్యారావు, సత్తెమ్మ కాలనీ, కశింకోట

సమయం వృథా అవుతోంది..



కశింకోట రైల్వే గేటు ఒక్కొక్కసారి ఒకేసారి మూడు రైళ్లు వెళ్లే వరకు మూసి వేసి ఉంటోంది. పాసింజర్ రైళ్ల కంటే గూడ్స్ రైళ్లు వచ్చినప్పుడు పది నిమిషాల వరకు గేటు వేసి ఉంటోంది. దీంతో గమ్యాలకు చేరడానికి తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రత్యామ్నాయంగా ఫ్లైఓవర్ నిర్మించాలని చాలా కాలంగా కోరుతున్నా ఫలితం లేదు. ఇబ్బందులు తప్పడం లేదు.
– దేశంశెట్టి రాజు, సత్తెమ్మ కాలనీ, కశింకోట.

అండర్ పాత్ నిర్మించాలి



కశింకోట రైల్వే గేటుపై సత్వరమే అండర్ పాత్ వే నిర్మించాలి. ఇవి లేక ఏళ్ల తరబడి గేటు దాటడానికి నానా అవస్థలు పడుతున్నాం. ఎక్కువ రైళ్ల రాకపోకపోకలు సాగించడం వల్ల గేటు తెరిచిన వెంటనే మళ్లీ రెండు నిమిషాల వ్యవధిలోనే మూతపడుతోంది. నిత్య కార్యకలాపాలకు అవరోధం కలుగుతోంది. ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.
– తగరంపూడి సూర్యనారాయణ, కశింకోట.

70 మంది భద్రాచలం యాత్ర



పరవాడపాలెం నుంచి భద్రాచలానికి బస్సులో బయలుదేరుతున్న భక్తులు

కశింకోట: వైఎస్సార్ సీపీ పరవాడపాలెం గ్రామ అధ్యక్షుడు, సీతారాముల ఆలయ నిర్మాణ వ్యవస్థాపకుడు గొంతిన శివబాబు సొంత ఖర్చుతో సుమారు 70 మంది భక్తులను భద్రాచలం యాత్రకు శనివారం రాత్రి తీసుకెళ్లారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని బస్సులో వారిని తీసుకెళ్లినట్లు శివబాబు తెలిపారు. గతేడాది కూడా ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తిరుమలకు భక్తులను తీసుకెళ్లానన్నారు.

పాత రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి టౌన్: స్థానిక పాత రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు గుర్తించి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సకాలంలో చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. రిజిస్ట్రార్ ఆఫీస్ ఆవరణలో ఎండిన ఆకులు, చెత్తా చెదారం పేరుకుపోయింది. ఈ పరిసరాలను శుభ్రం చేసే వారు కరువయ్యారు. మూత పడిన ప్రభుత్వ కార్యాలయం కాబట్టి శానిటేషన్ సిబ్బంది ఇటువైపు చూడడం లేదు. అయితే మంటలు ఎలా వ్యాపించాయో తెలియడం లేదు. కార్యాలయానికి ఆనుకొని ఇళ్లు, షాప్‌లు ఉన్నాయి. మంటలు అదుపులోకి రావడంతో వారంతా పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

'దొండ'కు అభినందన



దొండ సిద్ధార్థను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.ఎం.నాయుడు, పార్టీ కార్యకర్తలు

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన దొండ సిద్ధార్థను గవరపాలెంలోని స్వగృహంలో ఆ పార్టీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు ఆదివారం కలిసి అభినందించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సిద్ధార్థను పార్టీ నాయకులు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకం పోయిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పార్టీ నాయకులు దొండ నరసింగరావు, విల్లూరి శివసూరి, కాండ్రేగుల రాము, కొణతాల త్రినాథ్, వి.వి. సంతోష్, కాండ్రేగుల హైమావతి, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులతో బొజ్జన్నకొండ కళకళ



బొజ్జన్నకొండకు తరలివచ్చిన సందర్శకులు

తుమ్మపాల: మండలంలో శంకరం వద్ద ఉన్న బొజ్జన్నకొండ ఆదివారం జిల్లా, రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో కళకళలాడింది. మెట్ల మార్గం మీదుగా కొండపైకి చేరుకుని రాతి గుహల్లోని బౌద్ధ స్థూపాన్ని దర్శించుకున్నారు. గుహల్లోని ప్రాచీన కట్టడాలను, అద్భుతమైన ఆర్కిటెక్చర్ శిల్పాలను తమ కెమెరాల్లో బంధించారు. బుద్ధుని జ్ఞాన మందిరం, వివిధ ఆకృత్తుల్లో బుద్ధుని విగ్రహాలు, బొజ్జన్న కొండ చరిత్రను తెలుసుకున్నారు. లింగాల కొండపై నిర్మాణాలు, కొండపై నుంచి చుట్టు పచ్చని పంట పొలాలను చూసి మురిసిపోయారు. కొండ దిగువన ఆహ్లాదకర వాతావరణంలో సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. కొండపై గుహలు, మెట్ల వద్ద ప్లాస్టిక్ సీసాలు కుప్పలుగా పడేసి ఉన్నాయి. బుద్ధుని ప్రధాన మందిరం వద్ద పరిసరాలను శుభ్రం చేయకపోవడంపై సందర్శకులు అసహనం వ్యక్తం చేశారు.

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

తుమ్మపాల: ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేసి గ్రామాలను పరిశుభ్రంగా చేయడమే లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని డీపీవో ఆర్.శిరీషారాణి తెలిపారు. పంచాయతీ రాజ్, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పారిశుధ్యంపై రెండు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. జిల్లాలో 646 గ్రామ పంచాయతీలలో ఉదయం 6 గంటల నుంచి ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామాల్లో ఉన్న చెత్త కుప్పలు, రోడ్ మార్జిన్, రోడ్ పక్కన ఉన్న పశువుల గెత్తం కుప్పలు తొలగించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా సంపద సృష్టిస్తున్నామన్న విషయాన్ని ప్రతి వ్యక్తికి తెలిసేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు డీపీవో తెలిపారు.

అర్చకుడు చిన్నిస్వామికి సత్కారం



పేరూరి చిన్ని స్వామిని సత్కరిస్తున్న శివ భక్తులు

అనకాపల్లి టౌన్: అర్చక ఐకాన్ అవార్డు గ్రహీత, భోగలింగేశ్వర స్వామి దేవస్థానం అర్చకుడు పేరూరి చిన్నిస్వామిని స్థానిక శివ భక్తులు సత్కరించారు. స్థానిక ఆలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిన్ని స్వామి అర్చకుడిగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ మతాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎల్లపు చంద్రమోహన్, మళ్ల గోపి, కాండ్రేగుల దాస్, వి.నాని, కె.ప్రసాద్, ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ నిమజ్జనోత్సవం



కశింకోట శారదానదిలో గౌరమ్మ విగ్రహ నిమజ్జనోత్సవం



జెయింట్ వీల్స్ వద్ద పిల్లల సందడి

కశింకోట: స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని ఆలయం నుంచి ఊరేగింపు చేపట్టారు. మహిళల కోలాటాలు, మ్యూజికల్ ఆర్కెస్ట్రాతో గవరపేట మధ్య వీధి మీదుగా పెద్దగుమ్మం వీధి వరకు ఊరేగింపు సాగింది. దారి పొడవునా గౌరమ్మను దర్శించి ప్రజలు పూజలు చేశారు. అనంతరం శారదానది ఒడ్డున సంప్రదాయంగా వేద మంత్రాల నడుమ పూజలు చేసి, నదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. శనివారం రాత్రి జరిగిన గౌరమ్మ ఉత్సవంలో డాన్స్ బేబీ డాన్స్, కె.కోటపాడు మండలం ఆనందపురానికి చెందిన బృందం బుర్రకథ, డూప్స్‌తో రికార్డింగ్ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతరలో జెయింట్ వీల్స్ వద్ద పిల్లలు సందడి చేశారు. భారీగా బాణసంచా కాల్చారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పక్కాగా ఇంటింటి చెత్త సేకరణ

కశింకోట: ఇంటింటా చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశించారు. కశింకోటలో ఆదివారం నిర్వహించిన ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ విజయవంతంగా చేపట్టాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించాలన్నారు. చెత్త సేకరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించి పారిశుధ్యం మెరుగుకు దోహదపడాలన్నారు. ప్రతి గ్రామంలో విరివిగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావులను అభినందించారు.



కశింకోటలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

డీఎల్‌పీవో ఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాల తొలగింపు

సంత్ నిరంకారీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థాన వరాహ పుష్కరిణి వద్ద వ్యర్థాలను తొలగించారు. ప్రాజెక్ట్ అమృత్, స్వచ్ఛ జలం-స్వచ్ఛ మనసు నినాదంతో సుమారు 200 మంది సేవాదళ సభ్యులు, వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సేవాదళ్ క్షేత్రీయ సంచాలకుడు డీఏఆర్ రవి మాట్లాడుతూ సద్గురు బాబా హరదేవ్‌సింగ్ మహారాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఏటా ఫిబ్రవరి 23న క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

యాజమాన్య పద్ధతులతో మామిడి, జీడిమామిడిలో దిగుబడులు

సబ్బవరం: ఉద్యాన పంటలైన మామిడి, జీడిమామిడి తోటల్లో పూత దశలో తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని సబ్బవరం జాగృతి సంస్థ కార్యాలయంలో సబ్బవరం, కోటపాడు, దేవరాపల్లి మండల రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అందించే పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులు సాగు చేస్తున్న టమాటా విస్తీర్ణం, మార్కెటింగ్‌పై రైతులు ఎదుర్కొనే సమస్యలు, రేట్లపై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి కిరణ్మయి పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకరరావు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో నినాదాలు చేస్తున్న వెంకటేశ్వర్లు

అనకాపల్లి టౌన్: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఐక్యంగా నిలబడి సమస్యల కోసం పోరాటాలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పీఆర్సీ, డీఏలు, ఆర్థిక బకాయిలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, వి.శ్రీలక్ష్మి, దాసరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'కోరెడ్ల'కు మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న పీడీఎఫ్ సభ్యులు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ పీడీఎఫ్ సభ్యులు కోరారు. పట్టణంలో పూడిమడక రోడ్, శారదా నగర్, కస్పావీధి, తదితర ప్రాంతాలలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ, నూతన విద్యావిధానం, రేషనలైజేషన్, తదితర సమస్యపై విజయగౌరి పోరాటం చేస్తారని, ఆమెకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీలక్ష్మి, రాజేష్, సతీష్, బి.ఉమామహేశ్వరావు, జె.రమేష్, ఆర్.శంకర్, జి.శ్రీరామ్, ఎ.రాజు, ఎం.బాబూరావు, ఎం.రమణ, తదితరులు పాల్గొన్నారు.